క్లుప్తంగా

వచ్చేనెల 1, 2 తేదీల్లో మండలస్థాయి క్రీడా పోటీలు

ఇచ్ఛాపురం: స్కూల్‌గేమ్స్‌ఫెడరేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1, 2 తేదీల్లో మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తామని ఎంఈవో-2 ఎస్.విశ్వనాథం అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకటో తేదీన ఈదుపురం జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, రెండో తేదీని లొద్దపుట్టి పాఠశాల ఆవరణలో ఖోఖో, చెస్ క్రీడాంశాలలో అండర్-14, 17 విభాగాల్లో బాలబాలికలకు ఎంపిక పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. నియోజకవర్గ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు కె.పద్మనాభం రెడ్డి, ఎంఎస్‌వో కృష్ణపుడియా పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

ఇచ్ఛాపురం: పురుషోత్తపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పని చేస్తూ వేరే పాఠశాలలకు బదిలీపై వెళ్లి ఉపాధ్యాయులను పాఠశాల సిబ్బంది మంగళవారం ఘనంగా సత్కరించారు. హెచ్ఎం వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం లత, ఉపాధ్యాయులు దేవరాజ్, రాజ్యలక్ష్మి, ఆదిలక్ష్మి, సత్యవాణి, రాజగోపాల్, ఫాల్గుణరావులను దుశ్శాలువలతో సత్కరించి అభినందించారు. ఎంఈవో కె.అప్పారావు, కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

కంబిరిగాం భూముల పరిశీలన

పలాస: కొంత కాలంగా వివాదాస్పదంగా ఉన్న కంబిరిగాం శ్మశానవాటిక భూములను తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి, సర్వేయర్లు మంగళవారం పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. భూవివాదానికి సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా తెలుసుకొని పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తామన్నారు.

జీసీఎఫ్ బృందం పర్యటన

సంతబొమ్మాళి: తీరప్రాంత మత్స్యకారుల జీవనోపాధి భద్రతను పెంపొందించేందుకు గ్రీన్ క్లైమేట్ ఫండ్ (జీసీఎఫ్) బృందం, ఈసీఆర్ఐసీసీ ప్రాజెక్టు బృందం మరువాడ గ్రామాన్ని మంగళవారం సందర్శించింది. ఈ సందర్భంగా మత్స్యకారులతో మాట్లాడారు. ప్రతికూల వాతావరణం పరిస్థితులను అధిగమించే సామర్థ్యాన్ని పెంపొందించేందుకు వివిధ ఉపాధి మార్గాలను సూచించారు. సముద్రపు నాచుసాగు, అలంకరణ చేపల పెంపకం, ఆల్చిప్పల పెంపకం, పీతల పెంపకం వంటి కార్యకలాపాల ద్వారా మత్స్యకార కుటుంబాల ఆదాయం పెంచవచ్చని బృందం సభ్యులు వివరించారు.

కవిటిలో కార్డన్ సెర్చ్

కవిటి: కవిటి కొత్తకాలనీలో మంగళవారం పోలీసులు వేకువజాము నుంచి ఉదయం వరకు కార్డన్ సెర్చ్ చేపట్టారు. గంజాయి, మత్తు పదార్థాల అమ్మకాలు, అక్రమ రవాణాపై ఆరా తీశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టామని ఎస్ఐ వి.రవి వర్మ తెలిపారు.

చదువుకు సర్దుపోటు!

- ఉపాధ్యాయుల ఖాళీలతో సాగని బోధన
- ఉన్నత పాఠశాలలకూ తప్పని ఉపాధ్యాయుల కొరత
- కవిటి మండలంలో 127 ఖాళీలు



కవిటి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

కవిటి: కూటమి ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటు పాఠశాలలపై పెను ప్రభావం చూపింది. చాలా పాఠశాలల్లో తగినంత మంది ఉపాధ్యాయులు లేని పరిస్థితిని తీసుకువచ్చింది. దీంతో పిల్లలు చదువుకు దూరమయ్యే పరిస్థితికి దారితీసింది. ఈ దుస్థితి కవిటి మండలంలో చాలా ఎక్కువ ఉంది. ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలతో వెలవెలబోతోంది. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన మనబడి 'నాడు-నేడు', జగనన్న మధ్యాహ్న భోజనం, అమ్మఒడి వంటి పథకాలతో పాఠశాలలు కళకళలాడాయి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఇటీవల జరిగిన టీచర్ల బదిలీల పుణ్యమాని కవిటి మండలంలో పనిచేసిన వారిలో చాలామంది కట్టకట్టుకొని ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. దీంతో భారీసంఖ్యలో ఖాళీలు ఏర్పడ్డాయి. ఎంతో నమ్మకంతో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందనే ఆలోచనతో బడుల్లో చేర్పించిన పేదపిల్లల భవిష్యత్తు అగమ్య గోచరంలో పడింది. ప్రస్తుతం కవిటి మండలంలో అన్ని కేటగిరీలకు సంబంధించి 102 పాఠశాలలు నడుస్తున్నాయి. ఈ పాఠశాలల్లో 503 మంది ఉపాధ్యాయులు హెచ్ఎం, ఎల్ఎఫ్ఎల్‌హెచ్ఎం, స్కూల్‌అసిస్టెంట్, ఎస్‌జీటీ కేడర్లలో పోస్టులు కేటాయించారు. వీటిలో కేవలం 376 మంది మాత్రమే ప్రస్తుతం పనిచేస్తుండగా 127 ఖాళీలు ఉన్నాయి. ఇందులో 57 పోస్టులు ప్రాథమిక, యూపీ పాఠశాలల్లో ఏర్పడ్డాయి. ప్రధానంగా బదిలీ అయిపోయిన వారిలో చాలామంది రిలీవర్ రాని కారణంగా ఇక్కడే ఉండిపోయారు. ఏకోపాధ్యాయ పాఠశాలలు భారీగా ఏర్పడ్డాయి. దీంతో ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయ ఖాళీల పుణ్యమాని అత్తెసర బోధన జరుగుతోంది. జూన్, జూలై, ఆగస్టు నెలల్లో పిల్లలు బోధనకు దూరమయ్యారు. దీంతో ఈ ఏడాది పరీక్ష ఫలితాలపై ఇది తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని ప్రధానోపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ప్రకటించిన డీఎస్సీలో ఎంపికైన వారికి ఇప్పట్లో పోస్టింగులు ఇచ్చే పరిస్థితి సమీపంలో కనిపించడం లేదు. దీంతో మరికొన్ని నెలలు పిల్లకు సరైన బోధన జరిగే అవకాశం లేదని విద్యావేత్తలు భావిస్తున్నారు.

సర్దుబాటు చేసి బోధన చేస్తున్నాం



ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భారీ సంఖ్యలో ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. దీంతో ప్రాథమిక పాఠశాలల నుంచి హైస్కూళ్ల వరకు చాలా చోట్ల ఖాళీలు ఏర్పడ్డాయి. దీన్ని అధిగమించి సాధ్యమైనంత వరకు ఉన్న ఉపాధ్యాయులను సర్దుబాటు విధానంలో బోధన చేపడుతున్నాం. శత శాతం ఫలితాలు కచ్చితంగా తీసుకువచ్చేలా తమవంతు కృషి చేస్తున్నాం.

– ధనంజయమజ్జి, ఎంఈవో-1, కవిటి

బదిలీపై వెళ్లిపోయారు..



ప్రభుత్వ పాఠశాలల్లో ఇటీవల జరిగిన బదిలీల కారణంగా చాలామంది ఉపాధ్యాయులు వేరే ప్రాంతానికి వెళ్లిపోయారు. అయితే ఇక్కడ నుంచి వెళ్లిన వారికి తగ్గ సంఖ్యలో దురదృష్టవశాత్తూ ఈ మండలానికి వచ్చి చేరేందుకు ఎవ్వరూ ఆసక్తి కనబరచకపోవడం విచారకరం. ప్రభుత్వం డీఎస్సీ నియామకాలు జరిపినా ఇక్కడ ఖాళీలను చూపిస్తేనే కొత్తవారు వచ్చి చేరేవీలుంటుంది. అలాకాకుండా అన్ని మండలాలను ఓపెన్ చేస్తే ఈ ఏడాది కవిటి మండలంలో ఇదే పరిస్థితి ఉంటుంది.

– మురళీప్రకాష్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి.

మంత్రి అచ్చెన్న అసమర్థుడు



నందిగాంలోని ప్రైవేటు ఎరువుల దుకాణం వద్ద ఏవోతో మాట్లాడుతున్న పేరాడ తిలక్

- రైతుల కష్టాలు పట్టవు
- ఎరువులను ఇచ్చుకోలేకపోవడం దారుణం
- టెక్కలి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పేరాడ తిలక్

టెక్కలి:

మంత్రి అచ్చెన్నాయుడుకు వ్యవసాయంపై అవగాహన లేదని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ మండిపడ్డారు. రైతులకు కనీసం ఎరువులు ఇవ్వలేని అసమర్థత మంత్రి అచ్చెన్న అన్నారు. టెక్కలిలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీజన్ ప్రారంభానికి ముందే జిల్లాకు ఎంత మేరకు ఎరువులు అవసరమవుతాయో కనీసం సమీక్షలు చేయకుండా తాత్సారం చేయడంతో ఇప్పుడు రైతులు పడిగాపులు కాయాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి సొంత నియోజకవర్గంలోనే రైతు సేవా కేంద్రాల్లో యూరియా దొరక్కపోవడంతో ప్రైవేట్ దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకుందన్నారు. యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతుంటే మంత్రికి కనీస చలనం లేకపోవడం బాధాకరమన్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందు వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందిని కక్షపూరితంగా బదిలీలు చేయడంతో రైతులకు ఎరువుల కష్టాలు ఎదురయ్యాయని వివరించారు. అంతేకాకుండా మొదటి విడత అందజేసిన ఎరువులు పూర్తిగా టీడీపీ కార్యకర్తలు దోపిడీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా వస్తుందని మంత్రి రైతులను మభ్యపెడుతున్నారని.. అయితే వాస్తవంగా కేంద్రం నుంచి 50 శాతం వాటా ఎరువులను ప్రభుత్వం తీసుకుని మిగిలినది నగదు బదిలీ చేసుకున్నారన్నారు. మరో వైపు మంత్రికి అనుకూలంగా ఉన్న ప్రైవేట్ డీలర్లు అడ్డగోలుగా ఒడిశా ప్రాంతాలకు యూరియాను తరలించేశారని ఆరోపించారు. సొసైటీలకు అందజేసిన యూరియాపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. కేవలం రైతులను మభ్యపెట్టడానికే ఇప్పుడు అధికారులతో తనిఖీలు చేయిస్తున్నారని వ్యాఖ్యానించారు. టెక్కలి నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు సుమారు 3,700 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా కేవలం 1408 మెట్రిక్ టన్నుల మేరకు సరఫరా చేసి చేతులు దులుపుకున్నారన్నారు. ఇప్పటికైనా మంత్రి చిత్తశుద్ధితో వ్యవహరించి రైతులకు అవసరమైన యూరియాను పంపిణీ చేయాలన్నారు. లేనిపక్షంలో మరోసారి ఆందోళన బాట పడతామని హెచ్చరించారు. నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, నాయకులు సింగుపురం వినోద్, అంబోడి విష్ణు ఉన్నారు.

అన్నదాత ఇబ్బందులు ప్రభుత్వానికి పట్టదా?

నందిగాం: ఎరువుల్లేక ఇబ్బంది పడుతున్న రైతుల గోడు కూటమి ప్రభుత్వానికి పట్టదా అని వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి పేరాడ తిలక్ ప్రశ్నించారు. నందిగాంలో పలువురు రైతులు ఆయనతో మాట్లాడారు. ఈ సందర్భంగా యూరియా లేక పడుతున్న ఇబ్బందులను తిలక్ దృష్టికి తీసుకువచ్చారు. గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు సరఫరా చేయడంతో ఇబ్బంది ఉండేది కాదని.. రైతు సేవా కేంద్రాల ద్వారా సరిపడేంత పంపిణీ చేయకపోవడంతో టెక్కలి, పలాస, కోటబొమ్మాళి వెళ్లి అధిక ధరకు కొనుక్కోవలసి వస్తుందని రైతులు వాపోయారు. దీంతో స్థానికంగా ఉన్న వెంకటేశ్వర ఎరువుల దుకాణాన్ని తిలక్ పరిశీలించారు. వ్యవసాయాధికారి శ్రీకాంత్‌వర్మను ఎరువులకు సంబంధించి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. నందిగాం మండలంలో 20 వేల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేస్తుండగా 1020 టన్నుల డీఏపీ, 1530 టన్నుల యూరియా, 403 టన్నుల పోటాషియం అవసరమని, ఎన్ని టన్నుల ఎరువులు ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు డీలర్ల ద్వారా పంపిణీ చేశారో చెప్పాలని ఏవోను ప్రశ్నించారు. మండలంలో ఇంతవరకు 577 టన్నుల యూరియా, 470 టన్నుల డీఏపీ పంపిణీ చేయడం జరిగిందని, త్వరలో మరికొంత యూరియా వస్తుందని ఏవో చెప్పారు. ప్రైవేటు డీలర్ మాట్లాడుతూ.. గతంలో ఎరువులకు ఇబ్బంది ఉండేదికాదని, ఈ ప్రభుత్వంలో తీవ్ర ఇబ్బంది కలుగుతుందన్నారు.

ఎరువుల్లేవు, వంశ'ధార' రాదు

- రైతులు పంటలను సాగు చేసేదెలా?
- పలాస మండల సమావేశంలో సభ్యులు ఆగ్రహం



మాట్లాడుతున్న ప్రత్యేక ఆహ్వానితుడు సాయిక్రిష్ణ

పలాస: ఆయకట్టుకు ఇంతవరకు వంశధార నీరు రాలేదు, ఎరువులు కూడా అందుబాటులో లేవని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు మండిపడ్డారు. పలాస మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఉంగ ప్రవీణ అధ్యక్షతన మంగళవారం జరిగింది. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు ఉంగ సాయిక్రిష్ణ, చినంచల, లక్ష్మీపురం ఎంపీటీసీ సభ్యులు బమ్మిడి దుర్యోధనరావు, జి.మోహనరావు తదితరులు మాట్లాడుతూ.. వంశధార నీరు విడుదల చేసి నెల రోజులు అవుతున్నా పలాసకు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు కాలువలో నీరు వచ్చిందని చెప్పారు. అలాగే ఎరువుల కోసం రైతులు నానాపాట్లు పడినప్పటికీ కనీసం అధికారులు తగిన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. టీడీపీ పేరు చెప్పిన వారికే ఎరువులు అందాయని గండు మోహనరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సభ్యుల ప్రశ్నలకు వ్యవసాయ అధికారులు నోరు మెదపలేకపోయారు. సమావేశంలో ప్రత్యేక అధికారి రవికుమార్, ఎంపీడీవో కె.వసంతకుమార్, తహసీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి, మెట్ట వైకుంఠరావు, వైస్ ఎంపీపీలు తలగాన శ్రీరాములు, సవర దాలమ్మ, మద్దిల పాపారావు, సర్పంచులు తామాడ మదన్, బొత్స రాజేశ్వరి, దువ్వాడ వామాక్షి, కొర్ల సంతోష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం బంజీరుపేటకి చెందిన సిమ్మ సింహాచలం(59) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. మృతుడు సింహాచలం ఈనెల 22వ తేదీన తనకు ఉన్న ఆర్థిక ఇబ్బందులు కారణంగా ఇంట్లో ఉన్న నిద్రమాత్రలు అధిక మొత్తంలో మింగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అది గుర్తించిన భార్య వరలక్ష్మి 108లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కోటబొమ్మాళి ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు

సరిపడా ఎరువులు ఇవ్వాలి

టెక్కలి: రైతులకు సరిపడా ఎరువులు ఇవ్వాలని టెక్కలి మండల నీటి సంఘం మాజీ అధ్యక్షుడు ఎస్.వెంకటరమణ కోరారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రైతులు యూరియా కోసం అవస్థలు పడుతున్నా అధికార యంత్రాంగం కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పందించి రైతులకు అవసరమైన యూరియా అందజేయాలన్నారు.

ఉత్సవ సందడి..



పలాస మార్కెట్‌లో పూజా సామగ్రిని కొనుగోలు చేస్తున్న భక్తజనం

ఊరూరా..వీధి వీధిలో ఉత్సవ సందడి నెలకుంది. బుధవారం నుంచి ప్రారంభం కానున్న గణపతి నవరాత్రి ఉత్సవాల కోసం కమిటీ సభ్యులు ముమ్మర ఏర్పాట్లు చేశారు. పోటాపోటీగా మండపాలను అందంగా తీర్చిదిద్దారు. పూజకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చిన వారితో మార్కెట్లు కళకళలాడాయి. జోరువానలో సైతం మార్కెట్లు చవితి శోభను సంతరించుకున్నాయి. వివిధ రూపాల్లో ఉన్న వినాయక విగ్రహాలను కొనుగోలు చేసి వాహనాలపై గ్రామాలకు తరలించారు. పర్యావరణ ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థలు మట్టి గణేష్ బొమ్మలను ఉచితంగా పంపిణీ చేశారు.

–సాక్షి నెట్‌వర్క్



పలాస మండల పరిషత్ కార్యాలయం వద్ద తుదిమెరుగులు దిద్దుకుంటున్న మండపం



కవిటి: కెకపాసుకుద్దిలో మట్టిగణపతి విగ్రహాలతో చిన్నారులు



సంతబొమ్మాళి: మట్టి వినాయకుని విగ్రహాలతో దండుగోపాలపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు



కంచిలి: వినాయక విగ్రహాన్ని వాహనంపై ఊరేగింపుతో తీసుకెళుతున్న కమిటీ కుర్రోళ్లు



కంచిలిలో పూజా సామగ్రిని కొనుగోలు చేస్తున్న భక్తులు



ఇచ్ఛాపురం: మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న శ్రీవాసవి కళింగ కోమటి సంక్షేమ సంఘం ప్రతినిధులు



టెక్కలి: వాహనంలో వినాయక విగ్రహాలను తరలిస్తున్న యువకులు



సోంపేట: మట్టి వినాయక విగ్రహాలతో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు



వజ్రపుకొత్తూరు రూరల్: వాహనంపైకి వినాయన విగ్రహాన్ని ఎక్కిస్తున్న యువకులు

ఘన నివాళి



మదర్ థెరిసా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఇచ్ఛాపురం రూరల్: ప్రార్థించే పెదవుల కన్నా.. సాయం చేసే చేతులు మిన్నా అంటూ సంఘ సేవకురాలు మదర్ థెరిసా సాటి మనుషులకు అందించిన సేవలు ప్రతి విద్యార్థికి ఆదర్శప్రాయమని ఎ.బలరాంపురం ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం జి.యశోద అన్నారు. మదర్ థెరిసా 116వ జయంతి సందర్భంగా మంగళవారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. థెరిసా వేషధారణలో చిన్నారులు అలరించారు. ఉపాధ్యాయులు బి.శంకరం, శేఖర్, గంగన్న దొర, గౌరీ, నీలవేణి, హిమగిరి, దాశరథి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

టెక్కలి రూరల్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని కోటబొమ్మాళి జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌చార్జి జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వాణి అన్నారు. కోర్టులో న్యాయవిజ్ఞాన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆడ పిల్లకు 18, మగ పిల్లలకు 21 సంవత్సరాలు పూర్తికాకుండా పెళ్లి చేస్తే రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా ఉంటుందన్నారు. సదస్సులో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు లఖినేని శ్రీనివాసులు, సీనియర్ న్యాయవాదులు పి.అర్జునరావు, పి.వాసుదేవరావు ఉన్నారు.

పకడ్బందీగా ఆదికర్మ యోగి అభియాన్

కంచిలి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆదికర్మయోగి అభియాన్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కంచిలి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి పేర్కొన్నారు. నువాగడ పంచాయతీని ఈ పథకానికి ఎంపిక చేసిన సంగతి తెల్సిందే. పంచాయతీ సిబ్బందికి స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో రెండో రోజైన మంగళవారం పథకంపై అవగాహన కల్పించారు. డిప్యూటీ ఎంపీడీవో జి.వీరభద్రస్వామి, జిల్లా రిసోర్స్ పర్సన్‌గా పాతపట్నం మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్ వ్యవహరించారు. ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు ఎన్.గోపి, ఎంఎల్‌హెచ్‌పి పి.భాగ్యలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.ధనలక్ష్మి, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఎస్.లోకనాథం పాల్గొన్నారు.